మెడిసిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్ మెడిసిటీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం పెద్ద పర్వతాపూర్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 150 మందికి బీపీ, షుగర్, కంటి పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు పరీక్షలు, గడ్డలు, కణతులు, థైరాయిడ్, చర్మ సమస్యలు, మోకాళ్ల నొప్పులు, నడుం నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలపై పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు, రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. వీరిలో ఇన్ పేషంట్ రోగులను మెడిసిటీ హాస్పిటల్‌కు తీసుకెళ్లి ఉచితంగానే వ్యాధులు నయం చేసి పంపిస్తామని డాక్టర్లు తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్ ఇతిహాస్ గోపాల, డాక్టర్ మేఘన, డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ ధృతి, ఆస్పత్రి సిబ్బందితో పాటు బాబుగౌడ్, శేఖర్, చేరాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై హర్షం



డిపోలో పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్: ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం 22 శాతం పీఆర్సీ ప్రకటించడంతో సోమవారం కాంగ్రెస్ నాయకులు మేడ్చల్ ఆర్టీసీ డిపోలో కార్మికులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలు ఏర్పాటు చేసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మండల, మున్సిపల్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి..

ఘట్‌కేసర్: ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం పీఆర్సీ ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ ఘట్‌కేసర్ మున్సిపాలిటీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలు యాదవ్, రాధాకృష్ణ ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నాగరాజ్ ముదిరాజ్, కౌన్సిలర్ మల్లేశ్, మాజీ సర్పంచ్ వెంకటేశ్ ముదిరాజ్, వెంకటేశ్, ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు సాయిచరణ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, శ్రీనివాస్, రఫీయుద్దీన్, యాహియా, రాజు, సుధాకర్, మల్లేశ్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం..

శామీర్‌పేట్: అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు 21 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చేందుకు నిర్ణయించడంతో కృతజ్ఞతలు తెలుపుతూ హకీంపేట ఆర్టీసీ డిపో వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటాలకు ఆర్టీసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు.

డిగ్రీ కళాశాల కోసం వినతి



మేడ్చల్: స్థానికంగా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఫీజుల భారంతో మేడ్చల్‌లో పేద విద్యార్థులు ప్రైవేటు కాలేజీలకు వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2007 సంవత్సరం నుంచి విద్యార్థి సంఘాలు డిగ్రీ కళాశాల కోసం పోరాడుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి సంతోష్ రాథోడ్, కార్యదర్శి కిరణ్‌కుమార్, నాయకులు మనోజ్‌కుమార్ తదితరులున్నారు.

వేడుకగా మహిళా దినోత్సవం



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని గోపికృష్ణ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ సుమిత్ర సురేశ్ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా మహిళలు నిర్వహించిన ఆటపాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షురాలు సరళ, లక్ష్మి, సురేఖ, సునంద, ఉమాదేవి, అనూరాధ, శిరీష, సుచరిత, గోదాదేవి, మంజుల, విజయ, అనుపమ, లావణ్య యాదవ్, స్వరూప, అనూషరెడ్డి, శ్రావణి పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో..

జవహర్‌నగర్: ప్రగతినగర్‌లో ప్రగతిశీల మహిళ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు లక్ష్మీబాయి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐఎంల్ మాస్ లైన్ సెంట్రల్ కమిటీ సభ్యురాలు క్రామేడ్ రమా మాట్లాడుతూ.. మహిళలు కలిసి కట్టుగా పోరాడి హక్కులు సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ, వరలక్ష్మి, జయమ్మ, రాజేశ్వరి, కనకమ్మ, మణెమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం



ఘట్‌కేసర్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల(2003–2004)లకు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం ఘట్‌కేసర్‌లో సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రెండు దశాబ్దాల తర్వాత కలిసిన స్నేహితులు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బాల్యంలో చేసిన అల్లరి పనులు గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సూర్యప్రభ, లక్ష్మీనరసింహ, జ్యోతి, శోభారాణి, ఉమాదేవి, అరుణ, సబితను సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు నవనీత, చంద్రరేఖ, విజయలక్ష్మి, శ్రావణి, మంగ, లక్ష్మీభవాని, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

- చివరి రోజు కీసరకు పోటెత్తిన భక్తులు
- వైభవంగా పూర్ణాహుతి కార్యక్రమం



క్షేత్ర దిగ్బలి చేస్తున్న వేద పండితులు, టీటీడీ వేద విద్యార్థులు

కీసర: కీసరగుట్ట రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం పూర్ణహుతి కార్యక్రమంతో వైభవంగా ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరురోజుల పాటు(మార్చి 6 నుంచి 11 వరకు) జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు జనరంజకంగా సాగాయి. సోమవారం ఉత్సవాలను సంపూర్ణం చేస్తూ వేదపండితులు పుల్లేటికుర్తి గణపతిశర్మ, వేద విద్యార్థుల బృందం క్షేత్ర దిగ్బలి కార్యక్రమం కొనసాగించారు. ఆలయానికి నలువైపులా ఉన్న దేవతామూర్తులకు వరి అన్నంతో చేసిన లడ్డూ ప్రసాదాలు నైవేద్యంగా సమర్పించారు. అనంతరం యాగశాలల్లో కలశాలకు పూజ చేసి పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తాటాకం నాగలింగం దంపతుల ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజు కావడంతో భక్తులు కీసరకు భారీగా తరలివచ్చి.. శివలింగాలకు అభిషేకాలు నిర్వహించారు.

చివరిరోజు పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి

బ్రహ్మోత్సవాల చివరి రోజు పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. గర్భాలయంలో కొలువైన స్వామివారికి అభిషేక పూజలు చేసి.. ఆలయ చైర్మన్ నాగలింగంతో కలిసి పూర్ణాహుతిలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వేద పండితులు మార్తి సత్యనారాయణ శర్మ, సీఐ వెంకటయ్య, ఎస్సై మధు, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు, ట్రస్టు బోర్డు సభ్యులు, ఈఓ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



పూర్ణాహుతిలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆలయ చైర్మన్ తదితరులు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మున్సిపల్ సమావేశానికి కౌన్సిలర్లు డుమ్మా

మేడ్చల్: సోమవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్‌కు 12 మంది కౌన్సిలర్లు డుమ్మా కొట్టారు. ఇటీవల జరిగిన బడ్జెట్, కౌన్సిల్ మీటింగ్‌లు అసంపూర్తిగా ముగియడంతో మరోసారి సమావేశం నిర్వహించాలని కౌన్సిలర్లు నిర్ణయించారు. అయితే, నిన్నటి సమావేశానికి నలుగురు మినహా కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు చెందిన 12 మంది కౌన్సిలర్లు హాజరుకాలేదు. బడ్జెట్ లెక్కల్లో అవకతవకలు ఉన్నాయని, కమిషనర్ కనీసం నోటీసులు కూడా పంపించడం లేదని, కేవలం ఫోన్లలో సమాచారం ఇస్తుండటంతో సమావేశాన్ని బహిష్కరించామని కౌన్సిలర్లు తెలిపారు. ఇదిలా ఉండగా, మీటింగ్‌కు హాజరుకాని వారికి నోటీసులు ఇచ్చి మరోసారి సమావేశం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి చెప్పారు.

రహస్యంగా మంతనాలు..

సమావేశాన్ని బహిష్కరించిన కౌన్సిలర్లలో ముగ్గురు కాంగ్రెస్, 9 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు మేడ్చల్ శివార్లలోని ఓ రిసార్టులో రహస్యంగా సమావేశమయ్యారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ తోటకూర వజ్రేష్‌యాదవ్‌తో సమావేశమై చైర్ పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలనే ఆలోచనలు చేసినట్లు తెలిసింది.

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

మేడ్చల్: నేడు డబీల్‌పూర్‌లో ఎమ్మెల్యే మల్లారెడ్డి పర్యటించనున్నట్లు మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దయానంద్ యాదవ్ సోమవారం తెలిపారు. గ్రామంలో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ శంకుస్థాపనతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటారని చెప్పారు.

'ప్రత్యేకాధికారుల పాలనలో ఎక్కడి సమస్యలు అక్కడే'

ఘట్‌కేసర్: ప్రత్యేకాధికారుల పాలనలో సమస్యలు రాజ్యమేలుతున్నాయని చౌదరిగూడ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చిన్న పని కోసం కార్యదర్శిని అడిగితే ప్రత్యేకాధికారికి చెప్పాలంటూ తప్పించుకుంటున్నారని ఆరోపించారు. మక్త అంగన్‌వాడీ కేంద్రంలో డ్రైనేజీ పొంగుతున్నా, మ్యాన్‌హోల్లకు మూతలు లేవని చెప్పారు. వీధి దీపాలు వెలగడం లేదని, ఓయూ కాలనీలో నీటి సమస్య, గ్రామంలో కోతులు, కుక్కలు ఎక్కువయ్యాయని తెలిపారు. సమస్యలపై ఫిర్యాదు చేయాలంటే ప్రత్యేకాధికారి అందుబాటులో లేరని చెప్పారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని భాస్కర్‌రెడ్డి తెలిపారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం



బాస్కెట్ బాల్ విజేతలతో మనోహర్‌రెడ్డి

ఘట్‌కేసర్: చదువుతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల(వీబీఐటీ) కార్యదర్శి డాక్టర్ జి.మనోహర్‌రెడ్డి అన్నారు. ఇటీవల మైసమ్మగూడ నరసింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన బాస్కెట్ బాల్ పురుషుల టోర్నీలో విజయం సాధించిన వీబీఐటీ కళాశాల జట్టుకు సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీఎస్ శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, శివలాల్, మహేశ్, వెంకటేశ్, ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.

అన్నోజిగూడలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

పోచారం: వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పోచారం పోలీసులు సోమవారం సాయంత్రం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అన్నోజిగూడ, ఎల్ఎన్ కాలనీ, ఎల్ఐజీ, సంస్కృతి టౌన్‌షిప్ ప్రాంతాల్లో కొనసాగిన ఫ్లాగ్ మార్చ్‌లో సీఐ బి.రాజు, భద్రతా దళాలు పాల్గొన్నాయి.

మెకానికల్ ఇంజినీర్లకు ఉపాధి అవకాశాలు పుష్కలం



మనస్వినీని సన్మానిస్తున్న ఏయూ అధ్యాపకులు

ఘట్‌కేసర్: వైద్యశాస్త్రంలో మెకానికల్ ఇంజినీర్లకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని మెడ్‌స్టార్ హెల్త్ రీసెర్చ్ సైంటిస్ట్ మనస్వినీ చెన్నోజు అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం డిజిటల్ మాన్యుఫాక్చరింగ్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'వైద్యశాస్త్రంలో మెకానికల్ ఇంజినీర్లకు ఉపాధి అవకాశాలు' సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యరంగంలో మెకానికల్ ఇంజినీర్ల ఆవశ్యకత, విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస్, చలపతి, రాజ్‌కుమార్‌రెడ్డి, నరేశ్‌కుమార్ గౌడ్, సుస్మితాసింగ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు నాలుగేళ్ల జైలుశిక్ష

మేడ్చల్: మహారాష్ట్రకు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు మేడ్చల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన జీత్‌రాజ్‌పాల్ సింగ్, అమర్ సింగ్ జగ్గార్ తాక్, లక్కీసింగ్ గబ్బర్‌సింగ్ టాక్, నిశాంత్ నన్నావ్రే 150 దొంగతనాల్లో నిందితులుగా ఉన్నారు. ఈక్రమంలో జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ పాడుపడ్డ ఇంట్లో మారణాయుధాలతో నివాసముంటూ దొంగతనాలకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. గత ఏడాది ఏప్రిల్‌లో సమాచారం అందుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ అనంతరం నిందితులకు న్యాయమూర్తి రమేశ్ నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఘట్‌కేసర్: నిరుద్యోగ యువతి, యువకులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావని జంగయ్య అన్నారు. పట్టణంలోని డ్వాక్రా భవనంలో నిరుద్యోగ యువతకు సత్యసాయి ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఇవ్వనున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేటి నుంచి మూడు వారాల వరకు మహిళ భవనంలో ఆసక్తి గలవారు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం ఫోన్: 99664 21486లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సాబేర్ అలీ, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవి, ఆంజనేయులుగౌడ్, నస్రీన్ సుల్తానా, నాయకులు సిరాజ్, రహీం, విష్ణువర్ధన్‌రెడ్డి, డ్వాక్రా మహిళలు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు పనులు షురూ

ఘట్‌కేసర్: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్య అన్నారు. రూ.20 లక్షలు మున్సిపల్ నిధులతో ఈడబ్ల్యూఎస్ కాలనీ వద్ద ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాల పనులు సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ సైదులు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు జరిగినప్పుడు పోలీసులకు సీసీ కెమెరాలు మూడో నేత్రంగా పని చేస్తాయన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సాబేర్ అలీ, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, డీఐ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవి, ఆంజనేయులు గౌడ్, నస్రీన్ సుల్తానా, నాగజ్యోతి, జహంగీర్, నర్సింగ్‌రావు, రవీందర్, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, అంజనేయులు, మురళీగౌడ్, మీనా, పద్మ పాల్గొన్నారు.

కోడి పిల్లల విషయంలో తగాదా.. ఒకరి హత్య



మృతుడు బబ్లూ మృతదేహం

కీసర: కోడి పిల్లల విషయంలో ఇద్దరు తగాదా పడగా.. ఒకరి హత్య జరిగింది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాలు.. ఒడిశా రాష్ట్రంలోని కుందమని జిల్లాకు చెందిన బబ్లూ(26), కబీచంద్ర కొన్నాళ్ల క్రితం గోధుమకుంటకు వలస వచ్చి ఓ కోళ్ల పరిశ్రమలో దినసరి కూలీలుగా చేరారు. కాగా, ఆదివారం రాత్రి కోడి పిల్లల విషయమై ఇద్దరూ తగాదా పడ్డారు. దీంతో కబీచంద్ర ఇంట్లో ఉన్న కత్తి తీసుకొచ్చి బబ్లూ కడుపులో పొడిచాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని స్థానికులు ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మేడ్చల్‌రూరల్: స్కూల్ బస్సు ఢీకొట్టడంతో ఒకరికి గాయాలైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కీసర మండలం రాంపల్లిలో నివాసం ఉండే వినోద్‌కుమార్(30) నూతనకల్‌లోని ఓ గ్రిప్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు తన బైక్‌పై వెళ్తున్నాడు. మునీరాబాద్‌లోని మాతిహోలి పాఠశాల సమీపంలో మలుపు వద్దకు రాగా మేడ్చల్ నుంచి మునీరాబాద్ వైపు వెళ్తున్న విజ్ఞాన్ స్కూల్ బస్సు వినోద్‌కుమార్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన అతడిని 108 వాహనంలో కిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

బాబు జగ్జీవన్‌రాం జీవితం స్ఫూర్తిదాయకం



విగ్రహం ఆవిష్కరిస్తున్న మందకృష్ణ మాదిగ

మేడ్చల్: దేశంలో అణగారిన వర్గాలకు మాజీ ప్రధాని, దివంగత బాబు జగ్జీవన్‌రాం స్ఫూర్తి ప్రదాత అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. మండలంలోని డబీల్‌పూర్‌లో ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రాం విగ్రహాన్ని ఆయన ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ.. నేటి తరానికి జగ్జీవన్‌రాం జీవితం స్ఫూర్తిదాయకం అన్నారు. ఉప ప్రధానిగా, రక్షణ మంత్రిగా పని చేస్తూ అట్టడుగు వర్గాల కోసం ఎన్నో సంస్కరణలు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రజిత రాజ మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ గీత భాగ్యారెడ్డి, సంజీవరావు, కవిత జీవన్, కళామండలి జాతీయ అధ్యక్షుడు ఎస్‌వై అశోక్, మాజీ ఉప సర్పంచ్‌లు సత్యనారాయణ, అశోక్, నాయకులు ఆరిఫ్, రాంచందర్, సురేశ్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

బీజేపీ బైక్ ర్యాలీ



ఘట్‌కేసర్‌లో ర్యాలీలో బైక్ నడుపుతున్న ఈటల రాజేందర్

ఘట్‌కేసర్: ఉమ్మడి ఘట్‌కేసర్ మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో సోమవారం బోడుప్పల్ మల్లన్న ఆలయం నుంచి ప్రారంభమైన బీజేపీ బైక్ ర్యాలీ ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అంబేడ్కర్ విగ్రహం వద్ద ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జీ మోహన్‌రెడ్డి, ఘట్‌కేసర్ మున్సిపల్ అధ్యక్షుడు విప్పర్ల హనుమాన్, ప్రధాన కార్యదర్శి రామతీర్థ, పోచారం అధ్యక్షుడు సురేశ్ నాయక్, బోడుప్పల్ అధ్యక్షుడు శ్రీనివాస్, పీర్జాదిగూడ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, బాల్‌రాజ్ ముదిరాజ్, శ్రీనివాస్, నరేశ్ ముదిరాజ్, సాయికృష్ణ, సిద్ధిరాజు, రవిశంకర్, విక్రాంత్‌రెడ్డి, సురేంద్ర, సిద్దార్థ పాల్గొన్నారు.

వార్డులలో బీజేపీ నాయకుల పర్యటన

మేడ్చల్: పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను బలపరచాలని కోరుతూ పట్టణ బీజేపీ నాయకులు 1, 2, 3 వార్డుల్లో పర్యటించారు. ఈటల రాజేందర్ కోడలు క్షమిత నాయకులతో కలిసి వార్డులలో పర్యటిస్తూ ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, ప్రేందాస్, రాజు, శ్రీకాంత్, వంశీ, ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, రాఘవరెడ్డి, హరిబాబురెడ్డి, వెంకటేశ్‌చారి, హేమలత రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న జాతర



జాతరలో పాల్గొన్న ఈటల రాజేందర్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో సోమవారం మల్లన్న జాతర మహోత్సవం వైభవంగా జరిగింది. ఏటా శివరాత్రి తర్వాత జాతర నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణం, అగ్నిగుండాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు స్వామివారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పాల్గొన్న మాజీ మంత్రి ఈటల..

జాతర మహోత్సవానికి మాజీ మంత్రి, బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ సోమవారం హాజరై పూజలు చేశారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, కౌన్సిలర్ సరస్వతి తదితరులున్నారు.

ఎస్‌బీఐ ఎదుట సీపీఎం నాయకుల నిరసన



మేడ్చల్: సుప్రీం కోర్టు ఆదేశాలను లెక్క చేయని ఎస్‌బీఐ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మండల సీపీఎం నాయకులు పట్టణంలోని ఎస్‌బీఐ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. బ్యాంకు ఎదుట బైటాయించి.. ప్లకార్డులు చేపట్టి నినాదాలు చేశారు. ఎలక్టోరల్ బాండ్లను గోప్యంగా ఉంచవద్దని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసినా యాజమాన్యం బీజేపీకి తొత్తుగా మారిందని ఈ సందర్భంగా నాయకులు విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, నర్సింగ్‌రావు, వెంకటేశ్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

పీస్ మీటింగ్‌కు హాజరైన మతాల పెద్దలు



మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

మేడ్చల్‌రూరల్: పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మేడ్చల్ సీఐ సత్యనారాయణ అన్నారు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలతో పీస్ మీటింగ్ నిర్వహించారు. శ్రీరామ నవమి, రంజాన్, హోలీ తదితర పండగలను కులమతాలకు అతీతంగా జరుపుకోవాలని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టవద్దని సూచించారు. సోషల్ మీడియాలో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. సమావేశంలో ఎస్సైలు మురళీధర్, లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

సాక్షి, మేడ్చల్ జిల్లా: సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో సంబంధిత జిల్లా అధికారులకు వినతులు అందజేశారు. గత రెండు, మూడు వారాల నుంచి కలెక్టర్‌తో సహా అదనపు కలెక్టర్లు, ముఖ్య అధికారులు ప్రజావాణికి దూరంగా ఉండటంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు 77 వినతులు స్వీకరించారు. జనవరి నుంచి ఇప్పటి వరకు ప్రజావాణికి 876 ఫిర్యాదులు అందినట్లు అధికార వర్గాలు తెలిపాయి.


వినతులు ఇవీ..

- మేడ్చల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ వినతిపత్రం సమర్పించారు. డిగ్రీ కాలేజీ మేడ్చల్‌లో ఏర్పాటు చేస్తే మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో చదువుకుంటున్న 3,500 మందికి పైగా ఇంటర్ విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి వస్తుందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు కిరణ్‌కుమార్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.
- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ, చెరువు భూముల కబ్జాలను అడ్డుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేశ్, కార్యవర్గ సభ్యులు హరినాథ్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. 2008 నుంచి నియోజకవర్గంలో ప్రభుత్వ, అసైన్డ్, చెరువు, దేవాదాయ, వక్ఫ్ భూముల కబ్జాలపై జిల్లా అధికారులు పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వారి వెంట సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, ప్రవీణ్, సహదేవరెడ్డి, మండల నాయకులు ఉన్నారు.

వేర్వేరు ఘటనల్లో మహిళలు అదృశ్యం



పందిరి సంధ్యారాణి



మైసమ్మ

మేడ్చల్‌రూరల్: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు అదృశ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మురళీధర్ తెలిపిన వివరాలు.. డబిల్‌పూర్‌లో ఉండే పందిరి సంధ్యారాణి(54) గత ఆదివారం మధ్యాహ్నం తన అత్తమ్మతో గొడవపడటంతో తన భర్త సత్యనారాయణ ఆమెపై చేయి చేసుకున్నాడు. దీంతో మనస్థాపానికి గురైన ఆమె ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో సత్యనారాయణ పోలీసులను ఆశ్రయించాడు.

మద్యం మత్తులో..

మేడ్చల్‌లోని వినాయక్‌నగర్ కాలనీలో ఉండే ఎర్రబోయిన లింగం, మైసమ్మ(50) గత ఆదివారం మద్యం తాగారు. అనంతరం మద్యం మత్తులో ఉన్న ఆమె ఎవరికి చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె కుమారుడు అనిల్ మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.